సాక్షి
కుమురం భీం
మంగళవారం ၊ 12 ၊ నవంబర్ ၊ 2024



నేత్రపర్వం.. గోదావరి హారతి

బాసరలో సోమవారం గోదావరి హారతి నిర్వహించారు. పుష్కర్ ఘాట్ వద్ద శివలింగాలకు ఋషి కుమారులతో అభిషేకం. అర్చన పూజలు జరిపించారు. 8లో▸



నీరున్నా నిరుపయోగం..!

తిర్యాణి మండలం కోర్లోంకలో 2009లో డోల్పుల వాగు ప్రాజెక్టు నిర్మించారు. కొన్ని చోట్ల కాలువలు అధ్వానంగా.. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /17.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం కారణంగా చలి ప్రభావం తగ్గుతుంది.

అమ్మకానికి తంటాలు!



దహెగాం మండలం రాళ్లగూడ గ్రామానికి చెందిన సుధాకర్ 15 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. పత్తి తీత పనులు మొదలు పెట్టగా.. ఇప్పటివరకు సుమారు 80 క్వింటాళ్ల వరకు ఇంట్లో నిల్వ చేశాడు. కాగజ్‌నగర్‌లో సీసీఐ కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో దిగుబడి మొత్తం రోజుల తరబడి ఇంట్లోనే ఉంచుకోవాల్సి వస్తోందని వాపోతున్నాడు.

లింగాపూర్: మండల కేంద్రానికి చెందిన జాదవ్ జైపాల్ నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాడు. ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర చెల్లించకపోవడంతో ఇంట్లోనే 15 క్వింటాళ్లు నిల్వ చేశాడు. వర్షాలతో పంట దెబ్బతిందని, వచ్చిన పత్తికైనా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించాలని కోరుతున్నాడు.

- ఆసిఫాబాద్, కొండపల్లిలో మాత్రమే సీసీఐ కేంద్రాలు ప్రారంభం
- వాంకిడి, జైనూర్, కాగజ్‌నగర్‌లో మొదలుకాని కొనుగోళ్లు
- ప్రైవేట్‌కు పత్తిని విక్రయిస్తున్న రైతులు
- దళారుల దందాతో నష్టపోతున్న వైనం



దహెగాం మండలం హత్తిని గ్రామానికి చెందిన ముడిమడుగుల పోశం ఏడెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇటీవల కూలీలతో పత్తి తీయించాడు. వారికి చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారికి క్వింటాల్‌కు రూ.6,800 చొప్పున ఐదు క్వింటాళ్లు విక్రయించాడు. జిల్లాలో ఇలా చాలామంది రైతులు పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్మి నష్టపోతున్నారు. త్వరగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధర చెల్లించాలని కోరుతున్నారు.

3.29 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లావ్యాప్తంగా 3.29 లక్షల ఎకరాల్లో పత్తి సాగు ఉంది. దిగుబడి 28 లక్షల క్వింటాళ్లు వస్తుందని అంచనా వేశారు. అయితే వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దహెగాం, కౌటాల, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతలమానెపల్లి, తిర్యాణి మండలాల్లో పత్తి ఏరివేత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానిక కూలీలు సరిపోక రైతులు ఇతర రాష్ట్రాల నుంచి మనుషులను రప్పిస్తున్నారు. కిలోకు రూ.10 వరకు చెల్లిస్తున్నారు.



దహెగాం(సిర్పూర్): పత్తి రైతు ఆగమవుతున్నాడు. జిల్లాలో ఓ వైపు పత్తి తీత పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా.. పూర్తిస్థాయిలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రైవేటుకు అమ్మితే గిట్టుబాటు ధర కూడా రాక నష్టపోతున్నారు. అసలే పూత, కాత దశలో వర్షాలు లేక పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 6 నుంచి 7 క్వింటాళ్ల వరకే పరిమితమైందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన పంటను కూడా అమ్ముకునే రోజుల తరబడి నిరీక్షించాల్సి రావడంపై మండిపడుతున్నారు.

రెండు కేంద్రాలు మాత్రమే ప్రారంభం

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన మండలం కొండపల్లి, జైనూర్‌లోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నెల 8న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆసిఫాబాద్, కొండపల్లి సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటివరకు రెండు వేల క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. సిర్పూర్ డివిజన్‌లోని రైతులకు కీలకమైన కాగజ్‌నగర్‌తోపాటు వాంకిడి, జైనూర్‌లో ఇంకా పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. అధికారుల అలసత్వంతో జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో దళారులు దందాకు తెరలేపారు. ప్రైవేట్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు అనుమతులు లేకున్నా గ్రామాలకు వెళ్లి పత్తి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం మధ్య రకం పింజ పత్తికి రూ.7,121, పొడవు రకం పింజ పత్తికి రూ.7,521 చెల్లించాలి. అయితే ప్రైవేటు వ్యాపారులు అన్నదాతలకు రూ.6,500 మించి ధర చెల్లించడం లేదు. తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారు. పత్తి తీసిన కూలీలకు డబ్బులు ఇవ్వడానికి ముందుగానే 5 నుంచి 10 క్వింటాళ్ల వరకు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

ఉదయం బంద్.. మధ్యాహ్నం ప్రారంభం

- ఫలించిన జిన్నింగ్ యజమానుల సంప్రదింపులు



జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో అమ్మకానికి తెచ్చిన పత్తి వాహనాలు

ఆసిఫాబాద్: పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధానాలతోపాటు ఎల్1, ఎల్2 పేరుతో కొనుగోళ్లు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ జిన్నింగ్ వ్యాపారులు సోమవారం జిల్లాలోని మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు నిలిపివేశారు. సీసీఐ కొత్తగా అమలు చేస్తున్న ఎల్1, ఎల్‌- 2 విధానంతో జిన్నింగ్ మిల్లుల యజమానులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆ సంఘం రాష్ట్ర కమిటీ పత్తి కొనుగోళ్లు నిలిపివేయాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని వ్యాపారులు బంద్‌లో పాల్గొన్నారు. బంద్ విషయమై రైతులకు సమాచారం ఇచ్చినా కొంతమంది పత్తి పంటను విక్రయించేందుకు జిన్నింగ్ మిల్లులకు తీసుకువచ్చారు. జిన్నింగ్ వ్యాపారుల సంఘం రాష్ట్ర కమిటీ సీసీఐ అధికారులతో చర్చించడంతో సమస్య పరిష్కారమైనట్లు జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్షుడు రఫీక్ జీవాని తెలిపారు. ఆ తర్వాత మధ్యాహ్నం నుంచి జిల్లా కేంద్రంలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభమయ్యాయి. 8 నుంచి 12 శాతం తేమతో క్వింటాల్ పత్తికి రూ.7,520 ధర చెల్లించారు.

త్వరలో ప్రారంభిస్తాం

జిల్లాలో ఆసిఫాబాద్, కొండపల్లిలో ఈ నెల 8న సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. జైనూర్, కాగజ్‌నగర్, వాంకిడిలోనూ త్వరలో ప్రారంభిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తికి గిట్టుబాటు ధర కల్పిస్తాం.

– అశ్వక్‌అహ్మద్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి

న్యూస్‌రీల్

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రమాదేవి, డీపీవో భిక్షపతిగౌడ్, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి సజీవన్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'యువతకు ఉపాధి కల్పించడంలో విఫలం'



మాట్లాడుతున్న ధర్మేంద్ర

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తిచేసిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగావకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వందలాది ప్రభుత్వ రంగ సంస్థలు మూసివేయడంతోపాటు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అనుమతులు ఇవ్వడం ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలు కొందరికే దక్కుతున్నాయని విమర్శించారు. డిసెంబర్ 9న నిర్వహించే ఏఐవైఎఫ్ మూడో జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి, నాయకులు కొదురుపాక మహేశ్, వర్కల్ రాకేశ్, వికాస్, సుధీర్, సాయి, రమ్య, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు కూడా జీవితంలో భాగం



క్రీడాకారులతో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీటీడీవో రమాదేవి తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యతోపాటు క్రీడలు కూడా జీవితంలో భాగమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఇటీవల రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించిన జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల బాలికలను కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీటీడీవో రమాదేవితో కలిసి సోమవారం అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదర్శ క్రీడాపాఠశాల విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. గిరిజన క్రీడోత్సవంలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో 12 బంగారు, 10 వెండి, ఐదు కాంస్య పతకాలతోపాటు ఇప్పటివరకు 30 మంది జాతీయ స్థాయి పోటీలు, వందమందికి పైగా విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించారని డీఎస్‌వో మీనారెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, హెచ్‌ఎం జంగు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం 'టోంకిని హనుమాన్'

- నేడు 23వ మహాపాదయాత్ర
- 30వేల మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండలం టోంకిని గ్రామంలోని హనుమాన్ ఆలయం భక్తులు కొంగు బంగారంలా విరాజిల్లుతోంది. 23 సంవత్సరాలుగా కార్తీక మాసంలో ప్రతీ రెండో మంగళవారం శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం కమిటీ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర నిర్వహిస్తున్నారు. నేడు సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, బెజ్జూర్, కాగజ్‌నగర్ తదితర మండలాలతోపాటు మంచిర్యాల, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి భక్తులు పాదయాత్రగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించనున్నారు.

పాదయాత్రకు ఏర్పాట్లు

మహాపాదయాత్రకు సుమారు 30వేలకు పైగా భక్తులు రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయానికి కిలోమీటరు దూరంలోనే వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయగా.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వసతులు కల్పిస్తున్నారు. కాగజ్‌నగర్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో డీఎస్పీ రామానుజం ఆలయ పరిసరాలను పరిశీలించి పోలీసులకు సూచనలు చేశారు. మహాపాదయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సిర్పూర్(టి) మీదుగా కౌటాల, కాగజ్‌నగర్ వెళ్లే వాహనదారులు ఈజ్‌గాం మీదుగా ప్రయాణాలు సాగించాలన్నారు.



శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం

ఆలయానికి వెళ్లే మార్గాలు

శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయానికి చేరుకోవడానికి కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మీదుగా టోంకిని గ్రామానికి వెళ్లవచ్చు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల నుంచి నేరుగా ఆలయానికి వచ్చే మార్గం ఉంది. దూరప్రాంతాల భక్తులు రైలు మార్గం ద్వారా సిర్పూర్(టి), కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లకు చేరుకుని బస్సు ద్వారా టోంకిని చేరుకోవచ్చు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. వివిధ మండలాలకు చెందిన ప్రజల నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్‌కు చెందిన హివ్రే సాయికుమార్ నిరుపేదనైన తనకు ప్రభుత్వ వైద్యశాలలో ఉద్యోగావకాశం కల్పించాలని అర్జీ సమర్పించాడు. పెండింగ్ వేతనం ఇప్పించాలని కెరమెరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.గోపాల్ దరఖాస్తు చేసుకున్నాడు. చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన కావుడే భీమయ్య తన పట్టాభూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని దరఖాస్తు సమర్పించాడు. దహెగాం మండల కేంద్రానికి చెందిన బక్కయ్య ఐనం శివారులో కొనుగోలు చేసిన రిజిస్టర్ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరాడు. చింతలమానెపల్లి మండలంలోని సమస్యలు పరిష్కరించాలని బాబాసాగర్‌కు చెందిన భోబ్రగడే గంతిదాస్ విన్నవించాడు. కాగజ్‌నగర్‌లోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో పదేళ్లుగా స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్న తనను అకారణంగా తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కిష్టపేట గ్రామానికి చెందిన దుర్గం శాంత వేడుకుంది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న సామాజిక సర్వేలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గురుకులాలను సందర్శించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



దహెగాం మండలం దేవాజీగూడెంలో 30 గుంటల భూమి కొనుగోలు చేశా. భూమి నా ఆధీనంలోనే ఉండగా.. రైతుబంధు కూడా వచ్చింది. అయినా ఆన్‌లైన్‌లో మాత్రం విక్రయించిన వారి పేరుతో చూపుతోంది. వివరాలు ఆన్‌లైన్‌లో పేరు సవరించాలి.

– సిద్దం శ్రీహరి, దహెగాం

పాస్‌పుస్తకం జారీ చేయాలి



సిర్పూర్(టి) మండలం లోనవెల్లిలో సర్వే నం .111/సి/2లో 1.310 ఎకరాల భూమిని మూడేళ్ల క్రితం కొనుగోలు చేశా. ప్రభుత్వ రికార్డులో అమ్మిన వ్యక్తి పేరుతోనే కొనసాగుతోంది. పట్టా మార్పిడి కోసం మీసేవలో దరఖాస్తు చేసుకుంటే స్లాట్ బుక్ కావడం లేదు. భూమి పట్టా మార్చి కొత్త పాస్‌పుస్తకం జారీ చేయాలి.

– ఎకాస్‌కర్ శీలాబాయి, లోన్‌వెలి

ఇంటి స్థలాన్ని ఆక్రమించారు



కెరమెరి మండల కేంద్రంలోని నా ఇంటి స్థలాన్ని సమీపంలో ఉండే ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు. దీనిపై ఫిర్యాదు చేయగా అధికారుల విచారణలో ఫోర్జరీ సంతకంతో నాకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. విచారణ జరిపించి న్యాయం చేయాలి.

– గీతె అంగర్, కెరమెరి

వాంకిడి ఆశ్రమ పాఠశాలలో విచారణ

- కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ?

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని 60 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన జరిగి రెండు వారాలు అవుతున్నా కారణాలు ఇప్పటివరకు తెలియరాలేదు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఆర్డీవో లోకేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మిషన్ భగీరథ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం ఆశ్రమ పాఠశాలలో విచారణ చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏఎన్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థినులను ఒక్కొక్కరిని విడివిడిగా పిలిచి మాట్లాడారు. అస్వస్థతకు గురైనరోజు తీసుకున్న ఆహారం, తాగునీళ్లు, తదితర అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. ఈ విచారణ గురించి అధికారులు మాత్రం ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఫొటోలు తీసుకునేందుకు కూడా అవకాశం కల్పించలేదు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలు తెలుసుకునేందుకు నీళ్లు, బియ్యం, తదితర ఆహార పదార్థాల శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించగా.. తాగునీరు కలుషితం కాలేదని తేలింది. ఆహార పదార్థాలకు సంబంధించిన రిపోర్టులు ఇప్పటి వరకు వెల్లడించలేదు. మూడు శాఖల అధికారులు కమిటీగా ఏర్పడి సోమవారం విచారణ చేపట్టడంతో ఆహార పదార్థాలకు సంబంధించిన ల్యాబ్ రిపోర్టు రావొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు రిపోర్టు ఆధారంగానే ఒక్కొక్క విద్యార్థినితో విడివిడిగా మాట్లాడి ఉండొచ్చని తెలుస్తోంది.

కొనసాగుతున్న కుటుంబ సర్వే

ఆసిఫాబాద్: జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. మూడో రోజు సోమవారం జిల్లాలో 10,331 కుటుంబాలను సర్వే చేశారు. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల్లో 1,56,649 కుటుంబాలు ఉన్నాయి. ఈ నెల 9న తొలిరోజు 5,244, రెండో రోజు 8972, మూడో రోజు 10,331 కుటుంబాల వివరాలు నమోదు చేశారు. ఇప్పటివరకు 24,990 కుటుంబాల సర్వే పూర్తయింది. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే కాగజ్‌నగర్ పట్టణంలో సర్వే తీరు పరిశీలించారు. సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

కెరమెరి(ఆసిఫాబాద్): సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను సోమవారం పరిశీలించారు. ప్రొఫార్మాలో కొన్నిచోట్ల తప్పులు దొర్లడంతో వాటిని సరిదిద్దారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఈవో ఆడే ప్రకాశ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు ఉన్నారు.



కెరమెరిలో వివరాలు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్

సమర్థవంతంగా సర్వే నిర్వహించాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణాదిత్య

కాగజ్‌నగర్‌రూరల్: కుటుంబ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణాదిత్య అన్నారు. మండలంలోని వంజీరితోపాటు మున్సిపల్ పరిధిలోని సర్‌సిల్క్‌కాలనీ, టీచర్స్‌కాలనీలో సర్వే తీరును కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతో కలిసి సోమవారం పరిశీలించారు. ఇళ్ల జాబితా ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో పొరపాట్లకు తావులేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ఎన్యూమరేటర్లకు అందించిన నమూనాలో ప్రతీ అంశాన్ని తప్పనిసరిగా నింపాలని ఆదేశించారు. వరికోత, పత్తి ఏరివేత పనులు కొనసాగుతున్నందున అవసరమైన పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, భూమిపాసు పుస్తకాలతో కుటుంబంలోని ఒకరు అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి సహకరించాలని సూచించారు. అనంతరం మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలో 34 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కృష్ణాదిత్య, పక్కన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట(మంచిర్యాల): మున్సిపాలిటీ పరిధిలోని ఫిర్దోస్‌నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఇసాక్ కొద్ది రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కాళేశ్వరంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రెండు తులాల బంగారం, రూ. 10 వేల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నాడు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఐపీ విభాగం ముందు గల ఆవరణలో 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు రిమ్స్ సిబ్బంది తెలిపారు. అతని వద్ద ఉన్న పేపర్లలో ఆదిలాబాద్‌కు చెందిన నీలయ్యగా రాసి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తీసుకెళ్లాలని సిబ్బంది కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలీవాడ శివారు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా విజయనగర్ కాలనీ బోర్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించిన అదే ప్రాంతానికి చెందిన షేక్ హుస్సేన్ వద్ద 115 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభించాయి. నార్కోటిక్ డ్రగ్స్ యాక్ట్ 1985 ప్రకారం నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక సీఐ ప్రమోద్‌రావు, ఎక్సైజ్ ఎస్సైలు శంకర్, సిబ్బంది లచ్చన్న, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్


పట్టుకున్న కొండచిలువ

నెన్నెల(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని గోలం లక్ష్మికి చెందిన పెరట్లో సోమవారం 10 అడుగుల కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బెల్లంపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ దినేష్‌ను పిలిపించారు. అతను కొండచిలువను పట్టుకొని జోగాపూర్ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నెల రోజుల క్రితం డీజే మల్లేశ్ ఇంటి ఆవరణలో రెండు కొండచిలువలు కోళ్లను మింగి యజమాని చేతిలో హతమయ్యాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భారీ కొండచిలువ ఇనుప కంచెలో చిక్కుకుని గాయాలపాలైంది. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు సంచరిస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

గోదావరికి హారతి ఇస్తున్న వేద పాఠశాల విద్యార్థులు



హారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



మహిళలు వెలిగించిన కార్తీక దీపాలు



నేత్రపర్వం.. గోదావరి హారతి

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో శ్రీవేద భారతి పాఠశాల వ్యవస్థాపకులు శ్రీవేద విద్యానందగిరిస్వామి ఆధ్వర్యంలో సోమవారం గోదావరి హారతి నిర్వహించారు. పుష్కర్ ఘాట్ వద్ద ముందుగా శివలింగాలకు ఋషి కుమారులతో అభిషేకం, అర్చన పూజలు జరిపించారు. అనంతరం చతుర్దశ భువన విశేష గంగా హారతి ఇచ్చారు. అనంతరం రుద్ర హోమం, రుద్రాభిషేకం, ఆకాశ దీపం, దీపోత్సవం, శివ పార్వతి కల్యాణం నిర్వహించి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. సరస్వతీదేవి ఆలయంలో ప్రదోషకాల నిత్య దీపోత్సవం నిర్వహించారు.

– బాసర (ముధోల్)

శారీరక దృఢత్వానికి క్రీడలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

• ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జోనల్‌స్థాయి క్రీడాపోటీలను ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అండర్ 14, 17, 19 జోనల్ స్థాయి పోటీలు ముధోల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలకు ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజులపాటు నిర్వహించనున్న పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాసర జోనల్ అధికారి పీఆర్ ఫ్లోరెన్స్ రాణి, డీసీవో ప్రశాంతి, గురుకుల ప్రిన్సిపాల్ చల్ల నరసింహారెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నిరంజన్ పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

దండేపల్లి(మంచిర్యాల): పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు దండేపల్లి మండలంలోని తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఆదిలాబాద్ జట్టు ప్రథమ స్థానంలో, మంచిర్యాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమ నిర్వహణకు తాళ్లపేట వర్తక సంఘం అధ్యక్షుడు రమణయ్య, నాయకపోడ్ సేవాసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మార్నేని భూమేష్ సహకరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజ, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

• ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జైనూర్ మండలం పానపటార్ గ్రామానికి చెందిన సునీత కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని, నార్నూర్ మండలం భీంపూర్ గ్రామానికి చెందిన భీంరావు సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని, ఇంద్రవెల్లి మండలం వడ్గాం గ్రామానికి చెంది రాంశావ్ ఎడ్ల జత మంజూరు చేయించాలని కోరారు. ఇంకా పింఛన్, డబుల్ బెడ్రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంత్ రావు, ఏవో దామోదర్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చెన్నూర్: మండలంలో రెండు రోజుల క్రితం జరిగిన హత్య కేసులో సోమవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నూర్ మండలంలోని ముత్తరావుపల్లికి చెందిన జాడి భూమయ్య భార్య సౌందర్యను పైడిపల్లి మల్లయ్య కుమారుడు రాజశేఖర్ ఏడునెలల క్రితం ఇంటి నుంచి తీసుకెళ్లాడు. దీంతో భూమయ్య రాజశేఖర్, సౌందర్యను హతమార్చాలని నిర్ణయించుకుని హైదరాబాద్‌లో గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో ముత్తరావుపల్లికి తిరిగి వచ్చాడు. కుటుంబ సభ్యుల్లో ఎవరినైనా హత్యచేస్తే తిరిగొస్తారని గ్రహించి ఈ నెల 9న తెల్లవారుజామున రాజశేఖర్ తండ్రి పైడిపల్లి మల్లయ్య కెనాల్ వద్దకు బహిర్భూమికి వెళ్లగా విషయం తెలుసుకున్న భూమయ్య అతన్ని వెంబడించి కొడవలితో దాడిచేసి హతమార్చాడు. నిందితుడు పారిపోయి చెన్నూర్‌లో తలదాచుకున్నాడు. సోమవారం మంచిర్యాలకు వెళ్లేందుకు కిష్టంపేట జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని వద్ద హత్యకు ఉపయోగించిన కొడవలి, నేరం జరిగిన సమయంలో వేసుకున్న దుస్తులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. రెండు రోజుల్లో హత్య కేసు ఛేదించిన సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావు, కానిస్టేబుళ్లు టీకయ్య, భూమన్న, రాజశేఖర్, హోంగార్డు ఖాదిర్‌ను అభినందించారు.

క్రీడాకారులు గెలుపు కోసం కృషి చేయాలి


పోటీలు ప్రారంభిస్తున్న గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): క్రీడాకారులు పోటీల్లో గెలుపుకోసం కృషి చేయాలని గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. పోటీల్లో కాళేశ్వరం జోన్ పరిధిలోని 15 కళాశాలల నుండి 1,275 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కాసిపేట గనిలో కార్మికుడికి గాయాలు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో సాతుకు కిషోర్‌కుమార్ అనే జనరల్ మజ్దూర్ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ టిండల్ బృందంతో పనికి వెళ్లిన కార్మికుడు ఉదయం షిఫ్టులో గనిలో 4సీం 11డిస్ట్రిక్ట్, 15డిప్ 30 లెవెల్‌లో కిందపడడంతో గాయాలయ్యాయి. పంపు లాగే ట్రాలి వస్తుందా అని చూసేందుకు వెళ్లిన కిషోర్ ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో మిగతా కార్మికులు వెళ్లి చూసేసరికి కదలలేని స్థితిలో పడి ఉన్నాడు. భారీ యంత్రాన్ని లేపుతున్న క్రమంలో స్లిప్ కావడంతో గాయాలై ఉంటాయని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సదరు కార్మికుడిని బీజోన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటనపై గని మేనేజర్ భూశంకరయ్యను వివరణ కోరగా మిగతా కార్మికులను విచారిస్తున్నామన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థితో అధ్యాపకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏ.అంజయ్య తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సింగరేణి తిలక్‌స్టేడియంలో ఈ నెల 9,10 తేదీల్లో అండర్–19 విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.ప్రభాస్ ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

జోనల్ క్రీడలు


మార్చ్‌ఫాస్ట్‌లో నిర్మల్ జిల్లా లెఫ్ట్‌పోచంపాడ్ క్రీడాకారులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల 10వ జోనల్ క్రీడా పోటీలు సోమవారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని కంజర్ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులతో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించారు. జాతీయ, సొసైటీ, స్పోర్ట్స్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన స్వాగతోత్సవ నృత్యాలు, మార్చ్‌ఫాస్ట్ అందరినీ అలరించాయి.

నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు

నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో 1200 మంది విద్యార్థినులు అండర్ 14, 17, 19 విభాగాల్లో పాల్గొననున్నారు. 14 గురుకులాల నుంచి 9 రకాల క్రీడాపోటీలు నిర్వహించనున్నారు.

ఉపాధ్యాయునికి కాళోజీ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న అంజయ్య

మామడ(నిర్మల్):మండలంలోని కొరిటికల్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు దాసండ్ల అంజయ్యకు కాళోజీ జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఈ నెల 9న హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, భారత్ కల్చరల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. సదరు ఉపాధ్యాయుడిని సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కోచ్ అవార్డు ఫైనల్‌కు నిర్మల్


ఆన్‌లైన్‌లో పాల్గొన్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్:వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు జిల్లా అధికారులు చేసిన కృషికి జాతీయస్థాయిలో గుర్తింపు దక్కుతోంది. ఒకేరోజు వేలాదిగా రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్(వాననీటి ఇంకుడు గుంతల) నిర్మాణాలను చేపట్టడంపై ప్రతిష్టాత్మక 'స్కోచ్' అవార్డు పరిశీలనలోకి తీసుకుంది. ఈమేరకు దేశవ్యాప్తంగా వందల్లో వచ్చిన నామినేషన్లలో నుంచి ఫైనల్ జాబితాకు ఎన్నికైన 17 నామినేషన్లలో జిల్లా కూడా ఉందని డీఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు.

నీటిబొట్టును ఒడిసి పట్టేందుకు..

ప్రతీ వాననీటి బొట్టును కూడా ఒడిసిపట్టాలన్న ప్రభుత్వాల పిలుపుమేరకు జిల్లా అధికారులు పలు కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. ఇందులో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో 2023, జులై 31న జిల్లావ్యాప్తంగా ఒకే రోజు 5,940 ఇంకుడుగుంతలు నిర్మించారు. మొత్తం ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలన్నింటిలో వీటిని నిర్మింపజేశారు. రికార్డుస్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమం జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. ప్రస్తుతం ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు చేపట్టిన నామినేషన్లలోనూ జిల్లా ఫైనల్‌కు చేరుకోవడం హర్షనీయమని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. త్వరలోనే ఫైనల్ ఫలితాన్ని వెల్లడిస్తారని, ఇందులో జిల్లాకు అవార్డు దక్కుతుందన్న ఆశాభావంతో ఉన్నామని తెలిపారు.

ఏఎంవీఐ కొలువు సాధించిన సుందర్


నియామకపత్రం అందుకుంటున్న సుందర్

జైపూర్(చెన్నూర్): సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సుందర్ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కొలువు సాధించాడు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. ఖమ్మం జిల్లాకు చెందిన తేజావత్ సుందర్ 2016లో ఎన్పీసీఐఎల్(న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియ లిమిటెడ్)లో తొలి ఉద్యోగం, 2018లో మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(అసిస్టెంట్ వర్క్ మేనేజర్), ఎస్టీపీపీలో మూడో ఉద్యోగం చేస్తూనే తాజాగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించాడు. ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

జైపూర్(చెన్నూర్): ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ సోమవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం జంగంపల్లికి చెందిన ఎల్కపల్లి రాజేందర్ జైపూర్ పవర్ ప్లాంటులో పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. అతని భార్య నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అతనికి కుమారుడు మనోజ్‌కుమార్ (16), కుమార్తె అంజలి సంతానం. కుమారుడు తరచూ కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

లోకేశ్వరం(ముధోల్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన కసిరే బీరన్న(34) కొంతకాలంగా ఎలాంటి పనిచేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం సాయంత్రం అతిగా మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొర్రెల కొట్టంలో ఉరేసుకున్నాడు. మృతునికి భార్య గంగామణి, కుమారుడు భరత్, కుమార్తె మనస్వీ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ..

చింతలమానెపల్లి(సిర్పూర్): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బుజాడి తిరుపతి (25)ఆదివారం రాత్రి ఇంట్లో వ్యవసాయ పనులకు వినియోగిస్తున్న పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు మహారాష్ట్రలోని అహేరి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మహారాష్ట్రలో మృతి చెందడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినట్లు చింతలమానెపల్లి ఎస్సై తెలిపారు.

కలెక్టరేట్‌లో పొర్లుదండాలు


పొర్లుదండాలు పెడుతున్న సాయికిరణ్

నిర్మల్‌చైన్‌గేట్: తనకు రావాల్సిన ఆస్తిని సోదరులు కాజేయాలని చూస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయం ఎదుట 28 రోజులు దీక్ష చేసిన నిర్మల్‌కు చెందిన చందుల సాయికిరణ్ సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌కు వచ్చాడు. ప్రజావాణిలో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని భావించాడు. కానీ ప్రజావాణి లేకపోవడంతో కలెక్టరేట్ ప్రాంగణంలో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపాడు. తన గోడును ఏ అధికారీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తన ఇద్దరు సోదరులు తన తండ్రితో కలిసి తనకు రావాల్సిన వాటా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్దకు వెళ్లి దీక్ష కొనసాగించాడు.

మద్యం మత్తులో యువకుల వీరంగం


గాయపడిన రమేశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మీ థియేటర్ సమీపంలో ఓ ఫైనాన్స్ వ్యాపారిపై కొందరు వ్యక్తులు మద్యం మత్తులో దాడికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్‌లోని క్రిష్ణ కాలనీకి చెందిన నగమోతు రమేశ్‌కు మరికొందరు వ్యక్తులకు బైక్ ఫైనాన్స్ విషయంలో వాగ్వాదం జరిగింది. సదరు యువకులు రమేశ్‌పై విచక్షణ రహితంగా దాడిచేసి గాయపరిచారు. స్థానికులు 100కు సమాచారం అందించడంతో పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అన్వర్, కానిస్టేబుల్ తిరుపతి ఘటన స్థలానికి చేరుకునే లోపు సదరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా గొడవ జరిగింది వాస్తవమేనన్నారు. రమేశ్ మద్యం సేవించి ఉన్నాడని, వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా సమాచారం ఇవ్వలేదన్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదన్నారు.